# మరోసారి ఆశీర్వదించండి

- బాన్సువాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా..
- స్వరాష్ట్రంలోనే గ్రామాలు, తండాలకు పుష్కలంగా నిధులు
- కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మొద్దు
- సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి, అక్టోబర్ 22: సీఎం కేసీఆర్ సహకారంతో రూ. 500 కోట్లతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, వచ్చే ఎన్నికల్లో తనను మరో సారి ఆశీర్వదించాలని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం ఆయన పొతంగల్ మండలం జల్లాపల్లి అబాదిలో సేవాలాల్, జగదాంబ మాత నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరుచేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే గ్రామాలు, తండాల అభివృద్ధికి పుష్కలంగా నిధులు వస్తున్నాయన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ రూ.500 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇచ్చినట్లు తెలిపారు. తన కుటుంబానికి మొదటి నుంచి బంజారాలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. రాజకీయంగా వారు ఎప్పుడూ తన వెంటే ఉంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 35 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చినట్లు చెప్పారు.

**కర్ణాటకలో కరెంటే దిక్కులేదు....**

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో మాయ మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, నేడు అక్కడ కరెంటే దిక్కు లేదన్నారు. తాగునీరు లేక అక్కడి ప్రజలు నానా కష్టాలు పడుతున్నారని తెలిపారు. కర్ణాటకలోకాంగ్రెస్‌కు ఓటు వేసి నేడు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మవద్దని సూచించారు. తెలంగాణ అభివృద్ధి కావాలంటే అక్కడ సీఎం కేసీఆర్ ఉండాలని, ఇక్కడ పోచారం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వివేక్, ఉప సర్పంచ్ బీమానాయక్, పౌరదేవి మహరాజ్ బాబూసింగ్, బద్యానాయక్, జడ్పీటీసీ శంకర్‌పటేల్, వైస్ ఎంపీపీ గంగాధర్‌పటేల్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ సిరాజ్, కిశోర్‌బాబు, ఎంపీటీసీ రాములు, వైస్ ఎంపీపీ వల్లెపల్లి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల అందజేత


బాధిత కుటుంబాలకు బీమా చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి, అక్టోబర్ 22 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదివారం బీమా చెక్కులను అందజేశారు. దోమకొండకు చెందిన గొర్ల నర్సయ్య మృతి చెందగా భార్య లక్ష్మితోపాటు మంజుల, పాత విజయ, పుష్పలత, బూస హరిత, సత్తవ్వకు మొత్తం ఆరుగురికి రూ. రెండు లక్షల చొప్పున రూ. 12 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తల కోసం పార్టీ తరపున బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. జిల్లా కేంద్రంలోని విప్ నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే సంక్షేమ పథకాలు

- తొమ్మిదేండ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా..
- మరోసారి ఆశీర్వదించి గెలిపించండి..
- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న షిండే


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే షిండే

డోంగ్లీ, అక్టోబర్ 22 : దేశంలో ఎక్కడ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలోనే సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నదని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన బిచ్కుంద మండలంలోని పెద్ద దేవాడ, హస్గుల, పెద్ద తక్కడపల్లి, దౌల్తాపూర్ గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా దౌల్తాపూర్ గ్రామంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గొల్ల కుర్మలు గొంగడి కప్పి గొర్రె పిల్లను బహూకరించారు. అనంతరం గ్రామంలోని బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమైక్య పాలనలో జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 40 ఏండ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేండ్లలో చేసి చూపించామన్నారు. సీఎం కేసీఆర్, ఎంపీ బీబీ పాటిల్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి వేలాది కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. బిచ్కుందలో రహదారులను విస్తరించడంతోపాటు సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగిరేలా తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ దేశాయ్, రైతు సేవా సహకారం సంఘం అధ్యక్షుడు నాల్చర్ బాలు శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ నాగనాథ్ పటేల్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బసవరాజ్ పటేల్, వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

- కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాం
- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబర్ 22: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాలకు వెళ్లి ప్రజలకు వివరించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి తగిన గౌరవం ఉంటుందన్నారు. దాదాపు రూ. 3వేల కోట్లతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు అంతజి హాజారి మదన్‌మోహన్, ఆయన కుమారుడు సతీశ్, మాక్లూర్ మండలం మాందాపూర్ గ్రామంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, యువకులు, ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు రాజా గౌడ్, ఉపాధ్యక్షుడు చిగుర్ల మల్లేశ్, జనరల్ సెక్రటరీ ఆది శ్రీను, నాయకులు అబ్బులు, సిద్ధు, మురళి, పెంటయ్యా, నందిపేట మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ కాలనీ సభ్యులు ఉన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే నివాసంలో కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండిత్‌ప్రేమ్, జన్నేపల్లి రంజిత్, సీపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



